క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



అవార్డు గ్రహీత రాజ సతీష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఎస్.రాజ సతీష్‌ను తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. స్థానిక పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున అధ్యక్షతన మంగళవారం సన్మాన కార్యక్రమము నిర్వహించారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ అవార్డు అందుకోవడం వలన నాకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

వంద పని దినాలు పూర్తయ్యేలా చూడాలి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ లోకేశ్వర్

పెద్దకడబూరు : మండలంలోని ఉపాధి కూలీలు వలస వెళ్లకుండా ప్రతి ఒక్కరూ 100 పని దినాలను పూర్తి చేసుకునేవిధంగా ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఏపీడీ లోకేశ్వర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తారాపురం గ్రామంలో హార్టీకల్చర్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఉపాధిహామీ ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో పనులు అడిగిన వెంటనే నిర్వహించేవిధంగా పనులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా హార్టీకల్చర్ లబ్ధిదారులకు నిర్ణీత సమయానికి పేమెంట్ వచ్చే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జేఈ ఖాదర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమలను తొందరగా కదిలించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని అర్బన్: ఉదయం 10 గంటల కల్లా ప్రతి వినాయకుడిని నిర్వాహకులు నిమజ్జనోత్సవానికి కదిలించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. మంగళవారం రాత్రి స్థానిక వీబీఎస్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరగా వినాయక ప్రతిమలను నిమజ్జనం చేస్తే ప్రజలు చూసి ఆనందం పొందుతారన్నారు. రాత్రి అయితే అందరికీ ఇబ్బందిగా ఉంటుందన్నారు. నిమజ్జనోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రూట్ మ్యాప్‌పై దుష్ప్రచారాలు చేయొద్దని, పోలీసుల నిఘా ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు విట్టా రమేష్, చెన్నబసప్ప, నాగరాజుగౌడ్, సాయి, మణికంఠ పాల్గొన్నారు.

సమాజానికి సీతారాములే ఆదర్శం



మాట్లాడుతున్న స్వామీజీ

కౌతాళం: యావత్ సమాజానికి సీతారాములే ఆదర్శమని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వీర్లదిన్నె గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను మంగళవారం ప్రారంభించారు. గీతాశ్రమం నిర్వాహకులు జయదేవానంద స్వామీజీ రామాయణంలోని ఆదర్శాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, ఉప సర్పంచ్ హనుమంతు, దశరథరెడ్డి, రవిచంద్రగౌడ్, అర్చకులు కృష్ణస్వామి, ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపంలో చోరీ

ఆదోని అర్బన్: స్థానిక ఆర్టీసీ కాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాల పక్కన వినాయక మండపంలో ఆంప్లిఫైర్ చోరీ జరిగిన ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వీర వినాయక మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో డీజే కోసం ఉపయోగించే రూ.35 వేలు విలువ చేసే ఆంప్లిఫైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు వినాయక మండలి సభ్యులు ప్రసాద్, శ్రీనివాసులు తెలిపారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

వృద్ధుడికి ఆశ్రయం

ఆదోని అర్బన్: ఉస్సేరి రహదారిలోని జీవనజ్యోతి ఆశ్రమంలో 70 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడిని చేర్చుకున్నట్లు నిర్వాహకులు విక్టర్‌పాల్ ఫిలిప్ మంగళవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధుడిని ఆశ్రమం వద్ద వదిలి వెళ్లిపోయారని, తాము వివరాలు అడుగగా వృద్ధులు ఏమీ చెప్పలేకపోయాడన్నారు. చాలా రోజులుగా భోజనం లేక నీరసంగా ఉన్న వృద్ధుడిని గమనించి ఆశ్రమంలో చేర్చుకున్నట్లు చెప్పారు. ఆశ్రమంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఆశ్రమానికి సాయం చేయదలచిన వారు సెల్ 9441400757 నంబర్లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరద



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: గత ఎనిమిది రోజుల నుంచి విజయవాడ, గుంటూరు పరిసరాల్లో వరద బీభత్సంతో ప్రజలు అల్లాడిపోతున్నారు, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే వరద ముప్పును పసిగట్టలేకపోయారని ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కేవలం సీఎం చంద్రబాబు ఇల్లు మునగకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్‌ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకు బుడమేరు నుంచి వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడలోకి నీళ్లు వదిలారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రిటైనింగ్ వాల్‌ను ఏర్పాటు చేయడంతో కొన్ని ప్రాంతాల ప్రజలు వరద ముప్పు నుంచి సేఫ్‌గా బయటపడ్డారన్నారు. బుడమేరు వాగు విస్తీర్ణం, వరద ఉధృతిని అంచనా వేయకుండా, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. దీంతో పెను విషాదం మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో చిక్కుకున్న వారికి నిత్యావసర వస్తువులను అందజేయడంలో ప్రభుత్వం విఫలమయ్యింది. ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు ప్రతిపక్షాలపై విరుచుకుపడడం సమంజసం కాదు. నేడు ప్రజలు రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయడంపై అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుచూపును అభినందిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ఒప్పుకుని ముున్ముందు ఇలాంటి వరద ఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

వరద బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

రాష్ట్రంలో కోస్తాంధ్రలో జరిగిన వరదల్లో బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి విమర్శించారు. వరద బాధితులను ఆదుకోవడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వరదల్లో చిక్కుకున్న వారి ఆకలి మంటలను తీర్చలేకపోతున్నారన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరదలు వస్తే ప్రతి ప్రాంతాన్ని పరిశీలించి బాధితులను ఆదుకోవడం జరిగిందని తెలిపారు.

ఉత్సవం.. కారాదు విషాదం

- నేడు గణేష్ నిమజ్జనోత్సవం
- అత్యుత్సాహంతో అపశ్రుతులు చోటుచేసుకునే అవకాశం
- జాగ్రత్తలు తీసుకుంటే సురక్షితం
- ఆదోని నియోజకవర్గంలో 400కి పైగా వినాయక ప్రతిమలు



సీఐలకు సూచనలిస్తున్న డీఎస్పీ సోమన్న

ఆదోని అర్బన్: జీవితం ఎంతో విలువైనది. అయితే కొంతమంది పండుగలు, ఉత్సవాల సందర్భంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించే క్రమంలో ప్రాణాలనే పోగొట్టుకుంటుండడం బాధాకరమైన విషయం. ముఖ్యంగా వినాయకచవితి నిమజ్జన వేడుకల సందర్భంలో కొన్ని చోట్ల, కొన్ని సమయాల్లో అపశృతి చోటు చేసుకునే అవకశం ఉంది. కొన్ని సందర్భాల్లో భక్తుల అత్యుత్సాహం కావొచ్చు, పొరపాటు కావొచ్చు.. ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ప్రతిఏడాది నిమజ్జన సందర్భంగా ఎక్కడో ఒకచోట విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం ఉమ్మడి జిల్లా అహోబిలంలో గణేష్ నిమజ్జనం చేస్తుండగా ఓ బాలుడు నీటిలో గల్లంతయ్యాడు. ఆళ్లగడ్డలో మండపం వద్ద డ్యాన్స్ చేస్తూ ఓ యువకుడు మృతి చెందాడు. వెల్దుర్తి మండలం సూదేపల్లి గ్రామంలో నిమజ్జనోత్సవంలో నీటిలో మునిగి వృద్ధుడు మృతిచెందాడు. ఎలాంటి అపశ్రుతులు జరగకుండా వినాయక చవితి వేడుకలు సంతోషంగా ముగియాలంటే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మద్యం దుకాణాలకు అనుమతిపై ఆందోళన

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసు అధికారులు చెబుతూనే గణేష్ నిమజ్జనోత్సవంలో మద్యం దుకాణాలు తెరుచుకునేందుకు అనుమతి ఇవ్వడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాలు తెరుచుకోవడం వల్ల ఆకతాయిలు మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- వినాయక విగ్రహాలను చీకటి పడకముందే నిమజ్జనం చేయాలి.
- విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు పెద్దలు మాత్రమే నీటిలో దిగాలి.
- పిల్లలు, ఆడపిల్లలను నీరు ఉన్న దరిదాపుల్లోకి రాకుండా చూసుకోవాలి. ఈత వచ్చిన వారినే నీటిలో దిగేలా చూసుకోవాలి.
- నిమజ్జనానికి తక్కువ సంఖ్యలో వెళ్లాలి. నిమజ్జనం పూర్తి అయ్యాక వెళ్లిన వారంతా ఉన్నారా, లేరానని సరి చూసుకోవాలి.
- నిమజ్జనం సందర్భంగా అనేకమంది అత్యుత్సాహంతో చేతిలో టపాసులు పెట్టుకుని కాల్చుకుంటారు. అలా చేయడం ప్రమాదకరం.
- కర్రసాము లాంటి విన్యాసాలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఊరేగింపు సందర్భంగా ఎత్తైన విగ్రహాలు తీసుకెళ్లే సమయంలో విద్యుత్ తీగలు తగలకుండా ఉండేలా వాహనంపై విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- ట్రాక్టర్లపై నుంచి గానీ నేలపై నిల్చొని ఫల్టీలు వంటివి, విన్యాసాలు లాంటివి చేయరాదు.
- డీజే బాక్సులు, వాహనాల పైకి ఎక్కి నిల్చోవడం, పైన డ్యాన్స్ చేయడం వంటివి చేయకూడదు.

ఆదోనిలో నేడు గణేష్ నిమజ్జనం

ఆదోని సెంట్రల్: అట్టహాసంగా ప్రారంభమైన వినాయక చవతి వేడుకలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదోని పట్టణంలో కొలువు దీరిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం బుధవారం జరగనుంది. అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లను చేశారు. నిమజ్జన వేళల్లో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పట్టణంలో 400 మండపాల్లో గణనాథున్ని కూర్చోబెట్టారు. చిన్న విగ్రహాలు, ఇళ్లలో కూర్చోబెట్టిన విగ్రహాలు వందల సంఖ్యలోనే ఉంటాయి. మండలంలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణంలోని చివరి కాలనీలో ఉన్న విగ్రహాలను గత సోమవారం నిమజ్జనం చేయగా అసలైన విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నేడు జరగనుంది.

పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలో శోభాయాత్ర వెళ్లే ప్రధాన రహదారులను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా గణేష్ విగ్రహాల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. విగ్రహాలు వెళ్లే దారిలో రోడ్డు ప్యాచ్ వర్క్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లను అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో క్రేన్లు గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సోమన్న, తహసీల్దార్ శివరాముడు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సీఐ సూర్యమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవంలో భారీ బందోబస్తు

పట్టణంలో బుధవారం జరిగే నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీపోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నాం. 508 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారు. అందులో నలుగురు డీఎస్పీలు, 26 మంది సీఐలు, 37 మంది ఎస్ఐలు, 116 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 100 మంది సబ్‌డివిజన్‌లో ఉన్న పోలీసులు ఉంటారు. అంతేకాకుండా మరో 200 మంది అదనపు పోలీసు బలగాలు వస్తారు. సీసీ కెమెరాలు, డ్రోన్‌లు నిఘాలో ఉంటాయి. ప్రతి మండప నిర్వాహకుడు ఉదయం 9 గంటల నుంచి వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తరలించేలా చర్యలు తీసుకోవాలి.

– సోమన్న, డీఎస్పీ

యువత అత్యుత్సాహం ప్రదర్శించొద్దు

ఎదుటి వారి మనోభావాలను దెబ్బతీసేలా యువత ప్రవర్తించొద్దు. వినాయక ప్రతిమలను తీసుకెళ్లే వాహనదారులు మంచి డ్రైవింగ్ వచ్చే వారినే తీసుకెళ్లాలి. రాత్రి 11 గంటల తర్వాత డీజేలను అనుమతించం. భారీ గణనాథులను త్వరగా తరలించాలి. రాత్రివేళల్లో విద్యుత్ తీగల వద్ద జాగ్రత్తగా ఉండాలి. నిమజ్జన ఘాట్ల వద్ద ఆడపిల్లలు, చిన్న పిల్లలు, మద్యం సేవించిన వారు, ఈత రాని వారు రాకూడదు. భక్తుల ముసుగులో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు. మద్యం సేవించి అల్లర్లు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– శ్రీరామ్, ఆదోని వన్ టౌన్ సీఐ

పట్టణంలో వీధి వీధినా అడుగడుగున కొలువదీరిన వినాయకులు దర్శనమిచ్చాయి. అయా ప్రాంతాల్లో కూర్చోబెట్టిన గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు భక్తులు. నాలుగు రోజులుగా చిన్న పిల్లలు నుంచి పెద్దలు వరకు అందరు ఆధ్యాత్మికత, అన్నదాన కార్యక్రమాలతో ఉర్రుతలూగించారు. సాయంత్రం వేళల్లో ఉత్సాహంతో గంతులు వేస్తూ నృత్య ప్రదర్శనలను కూడా అయా ప్రాంతాల్లో నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని శిరుగుప్ప రహదారిలో ఉన్న ఎల్ఎల్‌సీ కాలువలో నిమజ్జనం చేయడానికి భక్తులు ఊరేగింపుగా వెళ్తారు.

చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజశ్విని

ఆదోని సెంట్రల్: చిరుత పులి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజశ్విని సూచించారు. మంగళవారం కైరుప్పల గ్రామంలో చిరుతపులి సంచారంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొంతమంది ప్రజలను భయందోళనకు గురి చేయడానికి ఫేక్ న్యూస్ చెపుతుంటారని, అలాంటి వదంతులను నమ్మవద్దన్నారు. ముఖ్యంగా చిరుత సంచరించే ప్రాంతాల్లో, కొండల సమీపంలో గొర్రెలను, మేకలను ఉంచవద్దని సూచించినా పట్టించుకోవడం లేదన్నారు. అలా ఉంచడం మంచిది కాదన్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ఎవరు ఒంటరిగా బయటకు రావద్దన్నారు. రాత్రిపూట ఆరు బయట ఎవరు పండుకోవద్దన్నారు. కొండలలోకి గొర్రెలను, మేకలను పశువులను తీసుకొని వెళ్లవద్దన్నారు. పులి సంచారం కనిపెట్టడానికి అయా ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పులి సంచారం చేసే రోడ్డు ప్రాంతాల్లో డ్రైవింగ్ స్లో చేయమని బోర్డు కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఏదైనా సమాచారం అందితే సెల్ 9502197985, 9440716085, 9949930663 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఈ -కేవైసీ చేయించుకోవాలి

గోనెగండ్ల : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలను నమోదు చేసుకున్న రైతులందరూ తప్పకుండా ఈ- కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. మంగళవారం వారు మండలంలోని హెచ్. కై రవాడి గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలో పంట నమోదు చేసుకున్న రైతులు ఇప్పటి వరకు 52శాతం మాత్రమే ఈ- కేవైసీ పూర్తి చేసుకున్నారని, ఈ నెల 15లోపు పంట నమోదు, ఈ- కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అలాగే పత్తి పంటలో ప్రస్తుతం రసం పీల్చే పురుగు ఆశించిందన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు ప్రొఫైనోఫోస్ 2మీల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బొజ్జగణపయ్యకు విశేష పూజలు



కాళికాదేవి ఆలయం వద్ద గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రంలో కోసిగిలో కొలువుతీరిన గణనాథులకు నాల్గవ రోజున మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. కోసిగిలోని శ్రీరామ నగర్, ఆంజనేయ స్వామి, గీతామందిరం, సిద్దప్ప పాళెం, వైఎస్సార్ సర్కిల్, మారెమ్మ దేవాలయం, కాళికా దేవి, ఈశ్వర దేవాలయం, సూగూరప్ప దేవాలయం సమీపాలలో కొలువుతీరిన వినాయకుల వద్ద పండి వంటలు తయారు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. శ్రీ రామ నగర్ కాలనీ భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఐదవ రోజున ఆయా ప్రాంతాల్లో కొలువుతీరిన గణనాథుల నిమజ్జన కార్యక్రమం ఉంటుందని వినాయక మిత్ర మండలి సభ్యులు తెలిపారు.

జీఓ నంబర్ 115ను రద్దు చేయాలి

ఎమ్మిగనూరురూరల్: నర్సింగ్ వ్యవస్థకు నష్టం వాటిల్లే జీవో నెంబర్ 115ను వెంటనే రద్దు చేయాలని ఏపీ నర్సింగ్ పోరాట సమితి పట్టణ నాయకులు నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నర్సింగ్ వ్యవస్థకు నష్టం వాటిల్లే విధంగా జీవో నెం.115ను ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం ఇంటెన్షిఫైడ్ వారికి స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇచ్చే విధంగా జీవోను తెచ్చారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు



సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, లేనిచో ఉద్యమాలతో ప్రైవేటీకరణను అడ్డుకుంటామని పలు వామపక్ష కార్మిక సంఘాల నాయకులు గోవిందు, రాముడు, తిమ్మగురుడు, ప్రసాద్, అబ్దుల్లా అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు నిరసనగా మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. వారు మాట్లాడుతూ మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు వల్ల స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గుతోందన్నారు. ఇటీవల కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, సహాయమంత్రి శ్రీనివాసవర్మలు సందర్శించి 45రోజుల్లో పరిశ్రమలో ఉత్పత్తి పెంచుతామని, ప్రధానితో చర్చిస్తామని హామీ ఇచ్చి వెళ్లినా నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. కారు చౌకగా పరిశ్రమనును ప్రైవేటు సంస్థలకు అప్పగించడానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక, కర్షక సంఘాల నాయకులు నరసయ్య, వీరేష్, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

జీవో 85ను రద్దు చేయాలి

నందవరం : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 85 రద్దు చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ రేవతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని ప్రాథమిక హెల్త్ కేంద్రంలో నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ జీఓ ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్త్యం చేశారు. అకస్మాత్తుగా ప్రభుత్వం జీవోను మార్చడం అర్థరహితమన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ఆదోని టౌన్: ప్రజలు టీబీ పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు షేకున్‌బాను, హరికృష్ణ, మహేష్ బాబు సూచించారు. మంగళవారం ఇందిరానగర్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో వైద్యసిబ్బంది ప్రజలకు టీబీపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గులో రక్తపుచారలు రావడం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గిపోవడం, ఉదయం సాయంకాలం జ్వరం ఉంటే టీబీ లక్షణాలుగా పరిగణించాలన్నారు. టీబీ నివారణకు బీసీజీ టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఉన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు బావూజీపేటలో వెలగని విద్యుత్ దీపాల స్థానంలో మంగళవారం కొత్తగా వీధిలైట్లను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ సురేష్ ఆధ్వర్యంలో వార్డులో సందు సందున కలియతిరుగుతూ వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటు చేశారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



రైతులతో ఏపీ రైతు సంఘం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: భారీ వర్షాలతో పంటలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పంటల పరిశీలన జీపు జాతాలో భాగంగా మండలంలోని నష్టపోయిన పలు పంటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తి, మిరప, వేరుశనగ పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర రైతు సంఘ సహాయ కార్యదర్శి జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపణ్ణగౌడ్, నాయకులు బీటీ చిన్నన్న, కేసీ జబ్బార్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

ఎమ్మిగనూరుటౌన్: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. బాల రాజు, బాబు, తిమ్మప్ప పాల్గొన్నారు.

16లోపు నవోదయకు దరఖాస్తు చేసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 16వ తేదీతో గడవు ముగుస్తుందని విద్యాలయ ప్రిన్సిపాల్ ఈ పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేకుంటే గడువులోపు చేసుకోవాలని చెప్పారు.


12న స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

నందవరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 12న (గురువారం) స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ మహమ్మద్ హనీఫ్ మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన బాల, బాలికలకు అండర్ -14, అండర్-17 విభాగంలో కబడ్డీ, ఖో-ఖో, వాలిబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, చెస్ పోటీలు నిర్వహిస్తునట్లు వివరించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 9490485159, 8978596965 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నందవరం : పాడి రైతులు పశువులకు సక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో రిలయన్స్, ఆర్డీప్ సంస్థ ఆధ్వర్యంలో పశువు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ చికిత్సలు, చూలు పరీక్షలు చేశారు. కేవీకే వెటర్నరీ సైంటిస్ట్ నిరంజన్ రెడ్డి, ఆర్డీప్ కార్యకర్త ఉసేని, ఎంపీటీసీ విజయమోన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సఫర్నీసాబేగం

ఎమ్మిగనూరురూరల్: గర్భిణులు, బాలింతలు పోషక విలువలుండే ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ సఫర్నీసాబేగం సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు మంచి పోషకాలు ఉండే ఆకు కూరలు, పాలు, కోడి గుడ్డును తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేఖ, అంగన్‌వాడీ టీచర్లు శైలజ, మౌలాబీ, మెహర్రూన్‌బీ, వెంకటేశ్వరమ్మ, గ్రేసమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ఆదోని సెంట్రల్: వరద బాధితులను ఆదుకోవాలని విశ్వనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం నర్సింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ విద్యార్థులు పట్టణంలోని పుర వీధుల్లో తిరుగుతూ విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలను సేకరించారు.

వరద బాధితులకు విరాళం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని ప్రియదర్శిని అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి బ్యాంకు తరఫున వరద బాధితుల సహాయార్థం రూ.లక్షను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించారు. ఈ మేరకు మంగళవారం చెక్కును స్థానిక ఎమ్మెల్యే పార్థసారథికి అందజేశారు. అలాగే బ్యాంకు సిబ్బంది ఒకరోజు వేతనం రూ.10,515ను విరాళంగా చెక్కు రూపంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపినట్లు చెప్పారు.